## పొలిటికల్ టూరిస్టులు..

# ‘గడ్డం’ బ్రదర్స్

- జనాలను ఆగం చేసేందుకు మళ్లీ వస్తున్న వివేక్, వినోద్
- అటు చెన్నూర్‌కు, ఇటు బెల్లంపల్లికి చేసిందేం లేదు..
- చెన్నూర్‌లో సీటు ఇస్తారనుకున్న సీపీఐకి ‘హ్యాండ్’ ఇచ్చినట్లేనా?

మంచిర్యాల, నవంబర్ 2(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లావాసులను ఆగం చేసేందుకు ‘గడ్డం’ బ్రదర్స్ మళ్లీ వస్తున్నారు. వెంకటస్వామి(కాక) ఎమ్మెల్యే, కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పని చేసినప్పుడు, గడ్డం వినోద్ (పెద్దోడు) మంత్రి, గడ్డం వివేక్(చిన్నోడు) ఎంపీగా పనిచేసినప్పుడు జిల్లాను పట్టుకొని లేరు. చెన్నూర్‌లో గెలవడం, ఓట్లేసిన జనాన్ని మోసం చేసి హైదరాబాద్‌లో మకాం వేయడం, వ్యాపారాలు చూసుకోవడమే వాళ్లకు తెలుసు. రాజకీయాలను అడ్డం పెట్టుకొని కోట్లు సంపాదించడంపై ఉన్న ప్రేమ, నమ్ముకున్న జిల్లావాసులకు సేవ చేయడంలో ఎప్పుడూ చూపించలేదు. గడ్డం కుటుంబానికి రాజకీయంగా అండగా ఉన్న చెన్నూర్ నుంచి 1957లోనే వెంకటస్వామి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం పెద్దపల్లి నుంచి ఎంపీగా గెలిచారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పని చేశారు. కానీ.. తన ఎదుగుదలకు కారణమైన చెన్నూర్‌లో నామమాత్రపు అభివృద్ధితోనే సరిపెట్టారు. ఇక ఆయన రాజకీయ వారసత్వం పునికి పుచ్చుకున్న గడ్డం వినోద్ చెన్నూర్ నుంచి గెలిచి రాష్ట్ర మంత్రిగా పని చేశారు. వివేక్ పెద్దపల్లి ఎంపీగా గెలిచారు. అన్నదమ్ములు ఇద్దరు మంత్రిగా, ఎంపీగా ఒకేసారి పదవులు ఎలగబెట్టారు. వారి హయాంలో ఏం చేశారు.. చెన్నూర్ కంటే చేసింది శూన్యం. పట్టుమని పది పనులు వేళ్ల మీద లెక్కబెట్టే అన్ని కూడా చేయలేదు. ఇక బెల్లంపల్లికి వీళ్లకు అసలు సంబంధమే లేదు. తండ్రి ఆస్తులు పంచుకున్నట్లే అన్నదమ్ములు బెల్లంపల్లి, చెన్నూర్‌ను పంచుకున్నారు తప్పితే ఎవరైనా స్థానిక నాయకులు, జనం కలుద్దామంటే ఈ అన్నదమ్ములు ఎక్కడ దొరుకుతారనే ప్రశ్న ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

### నిజమైన టూరిస్టులుగా గుర్తింపు..

ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. అసలు విషయం ఏంటంటే తండ్రి, తనయులు ఇక్కడి నుంచి గెలవడం పోయి వ్యాపారాలు చేసుకోవడం తప్ప ఏ నాడు నియోజకవర్గాన్ని పట్టించుకోలేదు. వారి హయాంలో మొత్తం మండల ఇన్‌చార్జీల వ్యవస్థే నడిచింది. మండలానికో ఇన్‌చార్జి పెట్టి వారి జేబులు నింపేందుకు గడ్డం బ్రదర్స్ కష్టపడ్డారు తప్పా జనాల బాగోగులు పట్టించుకోలేదు. హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం నిద్ర లేచి వాకింగ్ చేస్తూ.. నడిచినంత దూరం నడిచి కారు ఎక్కడం ఇక్కడ దిగడం.. మంచిర్యాలకు వచ్చి కలిసేటోళ్లను కలిసి వెళ్లిపోవడం తప్ప ప్రజల దగ్గరకు వెళ్లి కలిసేది లేదు. ఆదివారం మాత్రమే వచ్చే నిజమైన టూరిస్టులు కాక ఫ్యామిలీ అని మంచిర్యాల జిల్లాలో ఎవరిని అడిగినా చెప్తారు. బీఆర్‌ఎస్ పాలనలో తప్ప నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదనే నిజమని, నిత్యం సీఎం వెంటే ఉంటూ ప్రతిక్షణం చెన్నూర్ కోసం పరితపించి, నిధులు తెచ్చిన నాయకులు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలే తప్ప వేరేవారు కాదని జనం చెప్తున్నారు. గతంలో గెలిచినప్పుడు జనాన్ని పట్టించుకోకుండా ఈ రోజు కేవలం ఎన్నికల్లో లబ్ధిపొందడం కోసమే మేం వచ్చి బెల్లంపల్లిలోనే, మేం చెన్నూర్‌లోనే ఉంటామని ప్రచారం చేస్తూ ప్రజలను మోసం చేసేందుకు మరోసారి అన్నదమ్ములు సిద్ధమయ్యారనే విమర్శలు వస్తున్నాయి. ఎన్ని జిమ్మిక్కులు చేసినా వాళ్లను నమ్మేది లేదని ప్రజలు ముక్తకంఠంతో చెప్తున్నారు.

### నిరాకరణకు.. నిరసనలే నిదర్శనం..

మొన్నటి వరకు బీజేపీలో ఉన్న గడ్డం వివేక్ చెన్నూర్‌లో పర్యటించేందుకు వచ్చారు. కానీ.. చైతన్యవంతులైన చెన్నూర్ జనం వివేక్ ఎక్కడికి వస్తే అక్కడ తరిమికొట్టారు. వివేక్ గో బ్యాక్ అంటూ ధర్నాలు, నిరసలు చేశారు. ఎంపీగా ఉన్నప్పుడు ఏం చేశావ్, ఏ ముఖం పెట్టుకొని వచ్చావ్.. ఎన్నికలు వస్తున్నాయని ఓట్ల కోసం వస్తున్నవా? అంటూ నిలదీశారు. ఏ రోజు ఆయన పర్యటన ఉన్నా.. ఇదే కనిపించేది. చెన్నూర్‌లో బీఆర్‌ఎస్‌ను ఏం చేయలేమని అర్థం చేసుకున్న ఆయన కొన్ని రోజులు ఇటు రావడం మానేశారు. బీజేపీలో కీలకమైన నాయకుడిగా ఉన్నా తాను పోటీ చేసేందుకే భయపడ్డారు. ఇప్పుడు ఉన్నఫలంగా కాంగ్రెస్‌లో చేరారు. ఎన్ని పార్టీలు మారినా.. ప్రజలు ఆయన్ని తిరస్కరించినన్ని రోజులు ఏం చేయలేమని విషయం ఆయనకు ఎందుకు అర్థం కావడం లేదో తెలియడం లేదని ఆయన సన్నిహితులు వాపోతున్నారు. పార్టీలు మారుతున్నట్లు వార్తలు వచ్చిన ప్రతిసారి వివేక్ వాటిని కొట్టిపారేశారు. పార్టీ మారేది లేదన్నారు. తన అనుచరులు, కార్యకర్తలు ఇదే విషయం చెప్పుకొచ్చారు. ఇప్పుడు హఠాత్తుగా పార్టీ మారారు. ఎప్పుడు పార్టీ మారిన ఆయన ఏకపక్ష నిర్ణయమే తీసుకుంటారని, తమతో ఏం చెప్పరంటూ వివేక్ అనుయాయులు తలలు పట్టుకుంటున్నారు.




### సీపీఐకి హ్యాండ్..

చెన్నూర్‌లో పోటీకి మొన్నటి వరకు కాంగ్రెస్ పార్టీకి సరైన అభ్యర్థి దొరకని పరిస్థితి. దీంతో పదుల మంది ఆశావహులు తయారయ్యారు. దరఖాస్తులు చేసి ఎవరికి వారు తామే అభ్యర్థులమంటూ ప్రచారం చేసుకున్నారు. మరికొందరు నాయకులైతే కేవలం టికెట్ కోసమే ఆ పార్టీలో చేశారు. అభ్యర్థులను ప్రకటించే సమయానికి కాంగ్రెస్ వారికి రిక్తహస్తం చూపించింది. పార్టీ కోసం కష్టపడిన మీరెవరూ కాకుండా పొత్తుల్లో సీపీఐకి టికెట్ ఇవ్వనున్నట్లు మొన్నటి వరకు చెప్పుకొచ్చింది. ఇప్పుడు వివేక్ చేరికతో సీపీఐ టికెట్ గల్లంతయినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ నాయకులు చెన్నూర్ టికెట్ తమకే వస్తోందని భావించి ప్రచారానికి ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వివేక్ చేరికతో సీపీఐ డైలమాలో పడిపోయింది. కాంగ్రెస్ నుంచి టికెట్ వస్తుందనుకున్న నాయకులు.. ఇప్పుడు ఏం చేయాలో తెలియని అయోమయంలో పడిపోయారు. కొందరైతే రెబల్‌గా పోటీ చేయాలని చూస్తుంటే, ఒకరిద్దరూ వేరే పార్టీల నుంచి టికెట్లు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నిలకడలేని గడ్డం కుటుంబానికి టికెట్ ఇస్తే కాంగ్రెస్ ఆశావహులు తిరుగుబాటు చేసే పరిస్థితులు ఉన్నాయి. దీంతో ఆ పార్టీలో చీలికలు ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

# నేడు భైంసాకు గులాబీ దళపతి

- ‘ప్రజా ఆశీర్వాద సభ’కు రానున్న సీఎం కేసీఆర్
- బైపాస్ రోడ్డు మైదానంలో దద్దరిల్లేలా ఏర్పాట్లు
- పరిశీలించిన ముథోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం


సీఎం కేసీఆర్ సభకు జరుగుతున్న ఏర్పాట్లు

భైంసా, నవంబర్ 2 : నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో శుక్రవారం నిర్వహించే ‘ప్రజా ఆశీర్వాద సభ’కు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రానున్నారు. ఇందుకు సంబంధించి బైపాస్ రోడ్డు సమీపంలో సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గం నుంచి దాదాపు 50 వేలకుపైగా జనం వస్తారనే అంచనాతో వేదికను తయారు చేశారు. ముఖ్యమంత్రి మధ్యాహ్నం 2 గంటలకు రానుండగా.. స్వాగతం పలికేందుకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమాయత్తమయ్యారు. సభకు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడకుండా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మండలాలవారీగా ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కాగా.. సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కోరారు.

### తండోప తండాలుగా తరలిరావాలి..

అసెంబ్లీ ఎన్నికల్లో ముథోల్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గెలుపును ఆకాంక్షిస్తూ నేడు(శుక్రవారం) భైంసా పట్టణంలో నిర్వహించే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్ కోరారు. గురువారం భైంసా పట్టణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటలకు రానున్నారని, నలుమూలల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు భారీ సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈయన వెంట ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, సీనియర్ నాయకులు మురళీగౌడ్, రమాదేవి, పిప్పెర కృష్ణ, తోట రాము, సంజీవ్‌రెడ్డి, రమేశ్ మాశెట్టి వార్, విలాస్ గాదేవార్ ఉన్నారు.


సభా వేదికను పరిశీలిస్తున్న ముథోల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే విఠల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీశ్

## అన్నారం బ్యారేజ్‌కు

# ఢోకా లేదు

- సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం
- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యాదగిరి

చెన్నూర్ రూరల్, నవంబర్ 2 : అన్నారం బ్యారేజ్‌కు ఢోకా లేదని, రెండు రోజులుగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ అన్నారం బ్యారేజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యాదగిరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నారం బ్యారేజ్ రెండు గేట్ల నుంచి నీళ్లు వెళ్తున్నాయని, గేట్లు సక్రమంగా పనిచేయడం లేదంటూ రెండు రోజులుగా సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. యేటా సహజంగా ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ చేస్తామని, బ్యారేజీ 1275 మీటర్స్ పొడవు ఉంటుందని, రెండుచోట్ల సీ పేజీ ఉందని, ఎక్కడ కూడా ఇసుక రాలేదని వెల్లడించారు. ఇరిగేషన్ శాఖ, ఆప్కాన్ సంస్థల మధ్య కాంట్రాక్టు ఉంటుందని, బ్యారేజ్ నిర్వహణ బాధ్యత వారిదేనని వివరించారు. సీ పేజీ ఉన్న చోట నీళ్లు తగ్గినప్పుడు మెటల్ సాండ్, పిల్టర్ మీడియా వేస్తామని, సాండ్‌తోని రింగ్ బండ్ కూడా వేస్తామని పేర్కొన్నారు. యేటా సివిల్ మెకానిక్, ఎలక్ట్రికల్ మెయింటనెన్స్ ఉంటుందని తెలిపారు. బ్యారేజ్‌కు ఎలాంటి ప్రమాదమూ లేదని, పరిసర ప్రాంత ప్రజలు ఆందోళనకు గురికావద్దని సూచించారు.

# నామినేషన్ల పర్వం

- నేటి నుంచి 10వ తేదీ వరకు స్వీకరణ
- నియోజకవర్గ కేంద్రాల్లోనే దాఖలు
- సర్వం సిద్ధం చేసిన అధికార యంత్రాంగం



ఆదిలాబాద్ రిటర్నింగ్ అధికారి కార్యాలయం

ఆదిలాబాద్, నవంబర్ 2(నమస్తే తెలంగాణ) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ నేటి(శుక్రవారం) నుంచి ప్రారంభంకానుంది. ఎలక్షన్ కమిషన్(ఈసీ) గత నెల 9న షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 30న పోలింగ్ జరగనుండగా.. ఈ రోజు నోటిఫికేషన్ వెలువరించనుంది. 10వ తేదీ వరకు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో దాఖలు చేయనున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈ నెల 5న ఆదివారం సెలవు కావడంతో ఆ రోజు నామినేషన్లు తీసుకోరు. నామినేషన్ల స్వీకరణ కోసం ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. రిటర్నింగ్ అధికారితోపాటు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉంటారు. పోటీ చేసే అభ్యర్థులు నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేయాలి. నామపత్రాన్ని ఫాం-2బీ ఎన్నికల అధికారి కార్యాలయంలో ఇస్తారు. 13న నామినేషన్ల పరిశీలన, 14న ఉపసంహరణ ఉంటుంది. మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లోని ఐదు నియోజకవర్గాల్లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 4 గంటల వరకే పోలింగ్ ఉంటుంది.

### నామినేషన్ విధానం..

పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను నాలుగు సెట్లు దాఖలు చేయవచ్చు. నామినేషన్ పత్రాన్ని ఫారం-2లో అందజేయాలి. ఈ ఫారంతో అఫిడవిట్ జతపర్చాలి. రెండు స్టాంపు సైజు ఫొటోలను ఒకటి నామినేషన్ ఫారంపై, మరొకటి అఫిడవిట్‌పై పెట్టాలి. నామినేషన్ వేసే అభ్యర్థి ఎన్నికల కోసం బ్యాంకు ఖాతా తీసి ఖర్చులు చూపించాలి. జాతీయ, రాష్ట్ర గుర్తింపు పొందిన పార్టీ తరఫున నామినేషన్ వేసేటప్పుడు ఒకరు ప్రతిపాదించాలి. ఇండిపెండెంట్‌లకు పది మంది ప్రతిపాదించాలి. నామినేషన్ వేసే సమయంలో రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి నలుగురికి మాత్రమే ప్రవేశం ఉంటుంది.